క్లుప్తంగా

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. కార్తీక మాసం సందర్భంగా బీచ్‌కు వెళ్లే వారు కూడా అమ్మవారి దర్శనానికి రావడంతో ఆలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పంచారామ యాత్ర బస్సు ప్రారంభం



నరసాపురం డిపోలో పంచారామాల బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: కార్తీక మాసం సందర్భంగా పంచారామాలను దర్శించుకునేందుకు నరసాపురం డిపో నుంచి నాలుగు బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సుబ్బన్న రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి పంచారామాల బస్సు సర్వీసును ఆయన ప్రారంభించారు. నరసాపురం నుంచి రాత్రి 7.30 గంటలకు బస్సు బయలుదేరి అమరావతి, సామర్లకోట, ద్రాక్షారామం, భీమవరం, పాలకొల్లు మీదుగా తిరిగి నరసాపురం చేరుకుంటుందన్నారు. ఈ అవకావాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

రాధారమణ గుప్త మృతి



రాధారమణ గుప్త భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: పట్టణ వాణిజ్య ప్రముఖుడు, లయన్స్ కంటి ఆసుపత్రి తో పాటు అనేక సంస్థలకు భూరి విరాళాలు అందజేసిన దాత బొండాడ వెంకట రాధారమణ గుప్త (90) ఆదివారం ఆయన స్వగృహంలో మృతి చెందారు. ఆయనకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాధారమణ గుప్త మృతి వార్త తెలిసిన వెంటనే పట్టణ ప్రముఖులు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యేలు బంగారు ఉషారాణి, డా.సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి), అల్లు వెంకట సత్యనారాయణ, చేగొండి వెంకట హరరామజోగయ్య, మాజీ ఎమ్మెల్సీలు అంగర రామమోహన్, మేకా శేషుబాబు, ఛాంబర్ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఉన్నమట్ల కబర్ది తదితరులు నివాళులర్పించారు.

రాధారమణ గుప్త సేవలు మరువలేనివి...
పట్టణ వాణిజ్య ప్రముఖుడు రాధారమణ గుప్త అనేక సంస్థలకు భూరి విరాళాలు అందజేసిన గొప్ప దాత అని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. రాధారమణ గుప్త భౌతికకాయాన్ని ఆదివారం ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఆయనతో పాటు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ నాయకులు జోగాడ ఉమామహేశ్వరావు, ప్రసాద్, యాదం రెడ్డి శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించారు.

అగ్నిప్రమాద బాధితుడుకి విరాళం
యాళ్లవానిగరువులో ఇటీవల అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన మైలే ఏసు కుటుంబ సభ్యులను గుడాల గోపి పరామర్శించారు. ఏసు కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు నిమిత్తం రూ.5వేలు అందజేశారు.

కూరగాయల సాగు గట్టెక్కించేనా?



జగన్నాథపురంలో వంగ తోట



పెనుగొండలో దొండ సాగు చేస్తున్న దృశ్యం

- గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కూరగాయాల సాగుపై రైతుల మక్కువ
- పెరిగిన ధరలపై గంపెడాశలు

పెనుగొండ: వరుస తుఫాన్‌లతో తీవ్రంగా నష్టపోయిన కూరగాయల సాగు పెరిగిన ధరలు గట్టెక్కిసాయన్న గంపెడాశతో రైతన్నలు ఉన్నారు. ఆచంట నియోజకవర్గంలో సిద్ధాంతం, దొంగరావిపాలెం, కొతాలపర్రు, రామన్నపాలెం, తామరాడ, చినమల్లం, ములపర్రు,ఆచంట మండలంలో అయోధ్యలంక, పుచ్చలంక వంటి లంక గ్రామాల్లోనూ, పోడూరు, పెనుమంట మండలాల్లోనూ కూరగాయల సాగు వైపు రైతన్నలు మళ్లుతున్నారు. అయితే ఇటీవల వరుస తుఫాన్‌లు, గోదావరి వరదలతో కూరగాయల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. ముఖ్యంగా ఏటిగట్టు పరివాహక ప్రాంత లంకల్లోనూ, సిద్ధాంతం మధ్యస్థ లంకలోనూ, అయోధ్యలంక, పుచ్చల్లంకలోనూ గోదావరి వరదనీరుతో కూరగాయల తోటలు పూర్తిగా మునిగి పోయాయి. దీంతో పెట్టిన పెట్టుబడులు కాస్తా వరదపాలయ్యాయి. దీంతో సుమారు ఒక్కో రైతు రూ.50 వేలు వరకూ నష్టపోయారు. దీంతో కొంత మంది రైతులు తిరిగి నారు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరద, తుఫాన్‌ల తాకిడిని తట్టుకొని నిలబడ్డ తోటల్లోనూ రైతులు సాగు కొనసాగిస్తున్నారు. ఈ తరుణంలో కూరగాయల ధరలు పెరగడం రైతుకు ఊర ట కలిగించింది. ఆశించిన దానికన్నా ధరలు పెరగడంతో రైతులకు ఆయాచితంగా వరంగా మారింది. తుఫాన్‌లు, వరదలతోపోయిన నష్టం భర్తీ అవుతుందని భావిస్తున్నారు.

దళారులకే లాభసాటి
ఇదిలా ఉండగా, కూరగాయలు దళారులకే లాభసాటిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెటింగ్ చేసుకోవడానికి సరైన సదుపాయాలు లేకపోవడంతో దళారులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందంటూ వాపోతున్నారు. టోకు మార్కెట్‌కు కూరగాయలు అధికంగా వస్తే ధరలు తగ్గించి దళారులు కొనుగోలు చేస్తున్నారని, మరో రోజు నిలువ ఉంచుకోవడానికి కోల్డ్ స్టోరేజీ వంటి సదుపాయం లేకపోవడంతో టోకు మార్కెట్‌కు వెళ్లిన అనంతరం అయినకాడికి అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం టోకు మార్కెట్ వద్ద స్టోరేజీ సదుపాయం ఏర్పాటు చేస్తే రైతులకు సదుపాయంగా ఉంటుందంటూ తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతులకు అండగా నిలవాలని కోరారు.

వరుస వరదలతో ఇబ్బందులు



ఈ సీజన్‌లో వరుసగా వరదలు రెండు పర్యాయాలు రావడంతో పాటు, వరుస తుఫాన్లు రావడంతో కూరగాయల రైతులు అందరూ ఇబ్బందులు పడ్డారు. అయితే, రెండు నెలలుగా కూరగాయల ధరలు ఆశించిన స్థాయిలో ఉండడంతో నష్టాల నుంచి గట్టెక్కే అవకాశం ఉంది.

– కుడిపూడి ముసలయ్య, కూరగాయల రైతు సిద్ధాంతం

స్టోరేజీ సదుపాయం కల్పించాలి



టోకు మార్కెట్ వద్ద కూరగాయలు నిలువ ఉంచుకోవడానికి స్టోరేజీ వంటి సదుపాయం కల్పించాలి. దీని వల్ల రైతుకు ఉపయోగంగా ఉంటుంది. ధర భాగోకపోతే మరుసటి రోజు అమ్ముకొనే అవకాశం చిక్కుతుంది. మార్కెట్‌కు అధిక దిగుబడి వస్తే ధర తగ్గిపోతుంది. దీని వల్ల రైతులు నష్టపోతున్నారు.

– పితాని శ్రీనివాస్, కూరగాయల రైతు, దొంగరావిపాలెం

ఉత్సాహంగా కార్తీక వనసమారాధనలు



తూర్పుతాళ్లులో ఆర్యవైశ్య వనసమారాధనలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: ఆర్యవైశ్యులంతా సంఘటితంగా ఉండి సమాజసేవలో ముందుండాలని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చర్లంచర్ల సుబ్రహ్మణ్యం అన్నారు. నరసాపురం మండలంలోని తూర్పుతాళ్లు గ్రామంలో శ్రీవాసవి ఆర్యవైశ్య యువజన సంఘం, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో కార్తీక వనసమరాధన కార్యక్రమాన్ని ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చర్లంచర్ల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ఆన్‌లైన్ వ్యాపారాన్ని తగ్గించుకుని చిన్న వ్యాపారులను ప్రోత్సహించాలన్నారు. కోట్ల నాగ వెంకట సుధాకర్, నూలి వెంకటనారాయణ, రావు శ్రీను, శిరం రమేష్, వంకాయల రవికుమార్, కంచర్ల సోని పాల్గొన్నారు.

వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో..
పెనుగొండ: కార్తీకమాసం పురస్కరించుకుని పెనుగొండ, ఆచంట, పోడూరు మండలాల్లో ఆదివారం కార్తీక వనసమారాధనలు జోరుగా సాగాయి. పెనుగొండ వెలమ సంఘం ఆధ్వర్యంలోనూ, ఆచంట మండలం వల్లూరులో కమ్మ సంఘం ఆధ్వర్యంలో, కవిటంలో శెట్టి బలిజ గౌడ సంఘం ఆధ్వర్యంలోనూ వన సమారాధనలు భారీగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పితాని వెంకట్, జెడ్పీటీసీ సభ్యు ఉప్పలపాటి సురేష్ బాబు, దేవళ్ల రమేష్, తాళం శ్రీనివాస్, గెద్దాడ సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా గొంతు నొక్కుతున్న కూటమి ప్రభుత్వం



కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: సీఎం చంద్రబాబు పాలనా వైఫల్యాలను సోషల్ మీడియా ద్వారా ప్రజల ముందు ఉంచుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేస్తూ నియంత పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు తన నలభైఏళ్ల రాజకీయ జీవితంలో అనేక స్కామ్‌లకు పాల్పడ్డారని ఆయన గుర్తు చేశారు. దొంగే దొంగ దొంగ అని అరచినట్లు కూటమి ప్రభుత్వం తీరు ఉందని విమర్శించారు. చంద్రబాబు తన రాజకీయ జీవితంలో అనేక నేరాలకు పాల్పడ్డ వ్యక్తి అని వినిస్టన్‌బాబు దుయ్యబట్టారు. తన పాలనలో చేసిన అవినీతి స్కామ్‌లను బయటకు లాగుతున్న సోషల్ మీడియా కార్యకర్తలను అక్రమ అరెస్ట్‌లకు పాల్పడుతూ, తనకు అనుకూలంగా ఉన్న పోలీసు అధికారులతో ప్రత్యక్ష దాడులు చేయిస్తున్నారని ఆయన విమర్శించారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారం చేపట్టిన తరువాత వాటిని విస్మరించిన చంద్రబాబు అవే విషయాలను సోషల్ మీడియా వేదిక నిలదీస్తున్న కార్యకర్తలను పోలీసులతో అక్రమ అరెస్టులు చేయించడం నియంత పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు.

సూర్యకుమార్‌కు సత్కారం

పాలకొల్లు అర్బన్: గోదావరి కవనోత్సవం పేరిట రాజమహేంద్రవరంలో శ్రీ శ్రీ కళావేదిక, ఆది కవినన్నయ్య విశ్వవిద్యాలయం తెలుగు విభాగం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ శ్రీ కళావేదిక 141వ శతాధిక కవి సమ్మేళనం ఆదివారం నిర్వహించిన ఈ సమ్మేళనంలో పోడూరు మండలం చింతలగరువు ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న కొల్లాబత్తుల సూర్యకుమార్ తెలుగు భాష ఔన్నత్యంపై 'అమ్మ భాష అంతరిస్తుందా?' అనే వచన కవితం చెప్పారు. దీంతో సూర్యకుమార్‌ను శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, నన్నయ్య యూనివర్సిటీ వీసీ వై.శ్రీనివాసరావు, యూనివర్శిటీ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డి. జ్యోతిర్మయి సత్కరించి అభినందించారు.

బీచ్‌లో సందర్శకుల సందడి



బీచ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ దాసి రాజు

మొగల్తూరు: కార్తీకమాసం రెండో ఆదివారం పలు ప్రాంతాల నుంచి సందర్శకులు పేరుపాలెం బీచ్‌కు రావడంతో సందడి వాతావరణం నెలకొంది. ప్రతి ఏటా కార్తీకమాసం సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు భారీగా తరలివస్తారు. సుమారు 5వేలమంది పర్యాటకులు బీచ్‌ను సందర్శించారని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే ఆర్‌డీఓ దాసి రాజు బీచ్‌ను సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ రాజకిశోర్, ఎంపీడీఓ త్రిశూల పాణి, సిబ్బంది ఉన్నారు. మరోవైపు డీఎస్పీ ఎంబీఎస్ మురళీకష్ణ ఆధ్వర్యంలో ఇద్దరు సీఐల పర్యవేక్షణలో 90 మంది సిబ్బంది బందోబస్తు ఏర్పాట్లులో పాల్గొన్నారు.

పేదలపై భారాన్ని తగ్గించాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి బలరామ్

నరసాపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల బాధలు తీరుస్తాయని ఎన్నుకుంటే ప్రజలపైన మరింత భారాన్ని మోపుతున్నారని, ఆ భారాన్ని తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బలరామ్ విమర్శించారు. నరసాపురం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ తాపీ పనివారల సంఘ భవనంలో ఆదివారం సీపీఎం 25వ మహాసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభలు సూచిక, పార్టీ జెండాలను ఆవిష్కరించి, అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంచినీటి నీటకంఠం, బూడిద భువనేశ్వరిలు అధ్యక్షులుగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై విద్యుత్ భారాలు మోపుతున్నాయన్నారు. కొత్త మద్యం పాలసీతో మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇసుకు సమస్యతో నిర్మాణ రంగం కుదేలైందన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు, జిల్లా కార్యవర్గ సభ్యులు కవురు పెద్దిరాజు, నోముల కొండ, పుగాకు నారాయణరావు, పుగాకు పూర్ణ, గుత్తుల సాగార్, కె.బద్రి తదితరులు పాల్గొన్నారు.

క్షీరపురి నుంచి శైవ క్షేత్రాలకు బైక్ యాత్ర



శైవ క్షేత్రాల బైక్ యాత్రను ప్రారంభిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో శైవ క్షేత్రాల బైక్ యాత్ర ఘనంగా ప్రారంభించారు. ఆదివారం స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఈ బైక్ యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ఇలాంటి యాత్రలు నేటి తరానికి ఆధ్యాత్మిక భావాలను పెంపొందిస్తాయన్నారు. పాలకొల్లు నుంచి బయలుదేరిన ఈ బైక్ యాత్ర ముందుగా పాలకొల్లు మండలం పూలపల్లి గ్రామం, వీరవాసరం, భీమవరం, యనమదుర్రులో ఉన్న శైవ క్షేత్రాలను దర్శించుకోనున్నట్లు సేవా సమితి సభ్యులు శీరం ఆనందకృష్ణ తెలిపారు. సుమారు 500 మంది భక్తులు ఈ యాత్రలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాసరావు, పంచముఖ అంజనేయస్వామి ఆలయ ప్రధానార్చకుడురమణ గురుస్వామి, జక్కంపూడి కుమార్, ధనాని సూర్యప్రకాష్, ఆలయ ప్రధానార్చకుడు కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్షపత్రి పూజ

పెనుగొండ: కొడమంచిలి శివాలయంలో ఆదివారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో లక్షపత్రి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పార్వతి మాతకు లక్ష కుంకుమార్చన నిర్వహించారు. వేద పండితులు ప్రత్యేక పూజులు, అభిషేకాలు నిర్వహించి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. బ్రాహ్మణ సంఘం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.